క్లుప్తంగా

ఆగని ఇసుక దందా



సైదాపురంలో పట్టపగులే ఇసుకను రవాణా చేస్తున్న దృశ్యం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని కైవల్యానది నుంచి అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు వాపోతున్నారు. సైదాపురం, కమ్మవారిపల్లి, గంగదేవిపల్లి గ్రామాల సమీపంలోని నదిలో ఇసుక తవ్వి ఒక చోట డంప్ చేస్తున్నారని, రాత్రిళ్లు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక దందాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలక్షన్స్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం ఇన్ఫోసిస్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు 230 మంది ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్నారు. వీరిలో 22 మందిని టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



బీమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేనేజర్ గిరిధర్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్

దొరవారిసత్రం: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ గిరిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మహిళా మండల సమైక్య భవనంలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఏపీఎం మునిరాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలపై వివరించారు. ప్రతి ఒక్కరికీ బీమా ఉండాలని తెలిపారు. డైరెక్టర్ వి ఆంజనేయులు, వి అశోక్ కుమార్, కెనరా బ్యాంక్ మేనేజర్ హనుమంత్ నాయక్, ఎంపీడీవో గోవర్ధన్, రిసోర్స్ పర్సన్ అశోక్, కోఆర్డినేటర్ పరమానంద పాల్గొన్నారు.

పంటపై గడ్డి మందు పిచికారీ



వాడిపోయిన వరి పంటను చూపుతున్న బాధితుడు సుధీర్

వెంకటగిరి రూరల్ : భూమిని ఆక్రమించుకునేందుకు వరి పంటపై గడ్డి మందు పిచికారీ చేసినట్టు వెంకటగిరి రూరల్ మండలం బుసపాళెం గ్రామానికి చెందిన రైతు సుధీర్ వాపోయాడు. అతను బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని కథనం మేరకు.. బుసపాళెం గ్రామానికి చెందిన జమ్మళ్ల సుబ్బమ్మకు పుట్టింటి వారు పసుపు, కుంకుమ కింద ఆ గ్రామ సర్వే నంబర్ 185–6లో 14 సెంట్ల వ్యవసాయ భూమి ఇచ్చారు. అందులో వరి పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట పొట్ట, వెన్ను దశలో ఉంది. ఆ భూమిని గ్రామానికి చెందిన వెంకటసాయి, మురళీ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా వరి పంటపై గడ్డిమందు పిచికారీ చేశారని బాధితుడు సుధీర్ ఆరోపించాడు. పంట పూర్తిగా వాడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరాడు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఓజిలి: మండలంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చేతిబోర్లు, పైపులైన్లకు ముందస్తుగా మరమ్మతులు చేయించాలన్నారు. అవసరమైతే కొత్త బోర్లు వేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ 52 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులతో దరఖాస్తు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, ఎంపీటీసీ రఘురామ రాజు, శేఖర్, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాతోపాటు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నెర్రికాలువ–కాళంగి నది మధ్యవున్న పడిన గండి పూడ్చివేత పనుల్లో చేతివాటం చూపుతున్నారు. గండి పూడ్చేందుకని కాళంగి నది నుంచి ఇసుక తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకచోట పడిన గండి పూడ్చేందుకు అధికారులు మరొక చోట గండి కొట్టారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్చి వెనుక పడిన గండిని పూడ్చేందుకు ఆర్టీసీ డిపో సమీపంలో కాలువ కరకట్టను తవ్వేసిన ఇరిగేషన్ అధికారు.



గండి పూడ్చివేతలోనూ చేతివాటం

- భారీ వరదలకు నెర్రికాలువ కరకట్టకు పడిన గండి
- దాన్ని పూడ్చేందుకు మరోచోట గండి కొట్టిన అధికారులు
- పూడ్చివేత పేరుతో కాళంగి నదిని కుళ్ల బొడుస్తున్న కూటమి నేతలు

సూళ్లూరుపేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహించాయి. సూళ్లూరుపేట సమీపంలోని నెర్రికాలువ, కాళంగి నది ఉద్ధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో సూళ్లూరుపేట సమీపంలోని మిఖాయేల్ లూథరన్ చర్చి వెనుక నెర్రికాలువ–కాళంగినదికి మధ్యనున్న కరకట్టకు భారీ గండి పడింది. నెర్రికాలువ ద్వారా చెరువులకు చేరాల్సిన నీరు కాళంగి నది ద్వారా వృథాగా వెళ్లిపోతోంది. గండిని పూడ్చాలని రైతులు మొరపెట్టుకోవడంతో అధికారులు జనవరిలో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ గండిని పూడ్చే క్రమంలో కాలువలోకి నీరు రాకుండా చేయడానికి ఇరిగేషన్ అధికారులు ఆర్టీసీ డిపో సమీపంలో నెర్రికాలువ పాత కరకట్టను తవ్వేశారు. ఆ మట్టిని కాలువకు అడ్డంగా పోశారు. కాలువకు శాశ్వత మరమ్మతులు చేయకుండా గోనె సంచుల్లో ఇసుక, మట్టి నింపి అడ్డుకట్ట వేశారు. శాశ్వత మరమ్మతులు చేయకపోతే నెర్రికాలువకు వచ్చే వరద ప్రవాహానికి ఇసుక బస్తాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

కాళంగి నదిని కుళ్లబొడ్డుస్తున్న ఇసుకాసురులు

నెర్రికాలువకు పడిన గండి పూడ్చే పేరుతో కూటమికి చెందిన చోటా నాయకులు కాళంగినది కుళ్లబొడుస్తున్నారు. ముఖ్యంగా శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం సమీపంలోని కాళంగినది వంతెన కింద, వంతెన సమీపంలో పెద్ద పెద్ద గుంతలు తీసి ఇసుకను తరలించేశారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. జనవరి 17, 18, 19 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించారు. 17వ తేదీ రాత్రి భారీ వర్షం కురవడంతో పండుగ జరుగుతున్న మైదానంలో నీరు నిలిచింది. అక్కడ కాళంగి నది నుంచి ఇసుకను తీసుకొచ్చి చదును చేశారు. ఇదే అదనుగా భావించిన తెలుగు తమ్ముళ్లు కాళంగి నదిని కుళ్లబొడిసి భారీ ఎత్తున ఇసుకను తరలించేశారు. ఇప్పుడు నెర్రికాలువ గండి పూడ్చివేత పేరుతో మళ్లీ విజృంభిస్తున్నారు. శ్రీనగర్‌కాలనీ సమీపంలో ఖాళీగా జాగాలో ఇసుక తరలించే ట్రాక్టర్లు, జేసీబీలు పార్కింగ్ చేసి రాత్రి వేళల్లో ఇసుక, గ్రావెల్ తరలిస్తున్నారు. గ్రావెల్, ఇసుక తోలే చోటా నాయకుల వెనుక పెద్ద నాయకులు వుండడంతో అధికారులు వారి జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కాళంగినదిలో ఇసుక తవ్వుతున్న జేసీబీ

> **చర్యలు తీసుకుంటాం**
>
> కాళంగి నది నుంచి ఇసుక తరలించడానికి ఎవరూ అనుమతి ఇవ్వలేదు. అనుమతులు లేని చోట ఇసుక, గ్రావెల్ తవ్వితే తగిన చర్యలు తీసుకుంటాం. మా సిబ్బందిని రాత్రి వేళల్లో కాపలా పెడతాం. పోలీసుల సహకారం కూడా తీసుకుంటాం.
>
> – ఎస్‌వీ నరసింహారావు, సూళ్లూరుపేట తహసీల్దార్



కాలువ కరకట్టను తవ్వి నీరు వెళ్లకుండా వేసిన మట్టి



నెర్రికాలువ కరకట్టకు పడిన గండికి వేసిన ఇసుక బస్తాలు

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

సైదాపురం/డక్కిలి: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కింద ఇస్తున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని సైదాపురం, డక్కిలి ఎంపీడీవోలు పురుషోత్తం శివకుమార్, గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 7వ తేదీలోపు కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

త్వరితగతిన మిస్సింగ్ సిటిజన్ సర్వే

చిట్టమూరు : మండలంలోని 15 సచివాలయాల్లో మిస్సింగ్ సిటిజన్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం మల్లాం, అరవపాళెం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సర్వే రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిటిజన్ మిస్సింగ్ సర్వేతోపాటు పీఎసీఎస్ ఈకేవైసీను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు విధిగా చేయించి దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

నాయుడుపేట టౌన్ : సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. వారు బుధవారం మున్సిపల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. సమస్యలపై స్పందించకపోతే విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామన్నారు. నాయకులు మధు, హరికృష్ణ, రమణమ్మ, మహాలక్ష్మమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరులో 38 ఏళ్ల అనంతరం బుధవారం గ్రామదేవత పోలేరమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాలు, దేశాల్లో స్థిర నివాసాలు ఏర్పరుచుకున్న గ్రామస్తులంతా స్వగ్రామం చేరుకున్నారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈజాతర 38 యేళ్ల కిందట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గొంజి కొమ్మలు తీసుకుని స్వర్ణముఖి నది దాటుతుండగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందాడు. దాంతో ఆనాడు ఆగిపోయిన అమ్మవారి జాతరను తిరిగి మళ్లీ ఇప్పుడు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రధాన వీధులను విద్యుత్ దీపాల విశేషంగా తీర్చిదిద్దారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారికి వేదపండితుల విశేష పూజలు చేశారు. బాణసంచా కాల్చుతూ డప్పుల మోతల నడుమ ఉత్సవమూర్తిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కందమూడి శివకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలూరు మహేంద్రరెడ్డి, తిరుపాలయ్య, గోపాలయ్య, ప్రసాద్, ఫణి, రవి, పాండు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

‘మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి’

గూడూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి ఆదేశించారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గూడూరు డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి లైట్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పంచాయతీల ఆదాయం పెంచుకునేందుకు చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కొంతమంది కార్యదర్శులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, తీరుమార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో మధుసూదన్ రావు, డీఆర్‌పీ రవి, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి

గురుకుల పాఠశాల తనిఖీ



భోజనాన్ని రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూశారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లోని స్టాక్, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై సౌకర్యాలపై ఆరా తీశారు. చదువులు, ఉపాధ్యాయుల బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతరలో మళ్లీ విషాదం



నరసయ్య భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణరెడ్డి



నరసయ్య(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరులో పోలేరమ్మ బుధవారం జాతర రోజే పోలీసు కానిస్టేబుల్ మగ్గం నరసయ్య(35) హఠాన్మరణం చెందాడు. దాంతో గ్రామంలో మళ్లీ విషాదం నెలకొంది. స్థానికుల కథనం మేరకు.. 38 ఏళ్ల కిందట గ్రామదేవత పోలేరమ్మకు జారత నిర్వహించారు. ఆ రోజు అదే గ్రామానికి చెందిన వ్యక్తి గొంజి మొక్కలు తీసుకుని స్వర్ణముఖినది దాటుతూ వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందాడు. అప్పటి నుంచి అమ్మవారి జాతర చేయలేదు. 38 ఏళ్ల తర్వాత జాతర చేపట్టారు. అమ్మవారి ఘటం మోస్తున్న నరసయ్య ఇంటి దగ్గరకు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి మంగళహారతులు ఇచ్చేందుకు లోనికి వెళ్లాడు. బాత్‌రూంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. నరసయ్యకు గత డిసెంబరు 25వ తేదీన వివాహం జరిగింది. నరసయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య పార్వతి, తల్లి చెంగమ్మ ఉన్నారు. అతను వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నాడు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

పోలీసు కానిస్టేబుల్ మగ్గం నరసయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గ్రామానికి చేరుకున్నారు. భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న తమిళ జాలర్లు



కొండూరుపాళెం వద్ద హద్దులు దాటి వేటసాగిస్తున్న స్పీడు బోట్లు

తమిళ జాలర్లు నిబంధనలు ఉల్లంఘించి స్పీడు బోట్లతో తీరం వెంబడి చేపలు పడుతున్నారు. దీంతో సముద్రాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు చేపలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలలుగా చేపల వేట లేక, ప్రభుత్వం నుంచి సాయం అందక కుటుంబాల పోషణ కష్టంగా ఉందని జాలర్లు వాపోతున్నారు.

- స్పీడు బోట్లతో యథేచ్ఛగా చేపల వేట
- చేపలు దొరక్క ఇబ్బంది పడుతున్న స్థానిక మత్స్యకారులు
- పట్టించుకోని అధికారులు

వాకాడు : తిరుపతి జిల్లాలోని తీర ప్రాంత మండలాలైన చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో 77 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. 47 గ్రామాల్లో మత్స్యకారులు ఉన్నారు. దాదాపు 3500 మంది వేటకు వెళుతూ ఉంటారు. వీరికి దాదాపు 5 వేల వరకు ఇంజిన్ బోట్లు ఉన్నాయి. వారు సముద్రంలో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన తూత్‌కుడి, పాండిచ్చేరి తదితర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు 57 స్టీమ్ బోట్లలో ఇక్కడికి వస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటి వాకాడు మండలం తూపిలిపాళెం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం సముద్ర తీరానికి చేరుకుని చేపలు పట్టుకుంటున్నారు. వందల టన్నుల చేపలను తరలించుకుపోతున్నారు. నాలుగు నెలలుగా సముద్రంపై వేట లేకపోవడం, ప్రభుత్వం నుంచి వేట నిషేధ భృతి అందకపోవడం, ఉన్న సంపదను తమిళ జాలర్లు దోచుకుపోడుండడంతో నానా కష్టాలు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. తా ము నాలుగు నెలలుగా పస్తులతో అలమటిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తున్న తమిళ జాలర్లు

సాధారణంగా సముద్రం తీరం నుంచి 8 నాటికల్ మైళ్ల దూరంలోపు స్టీమ్ బోట్లు వేట చేయరాదని చట్టంలో పొందుపరిచారు. తమిళనాడుకు చెందిన జాలర్లు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. స్టీమ్, స్పీడు బోట్లను వినియోగిస్తూ తీరం వెంబడి చేపల వేట సాగిస్తున్నారు. ముఖ్యంగా కడలూరు, నాగూరు, నాగపట్నం, తూత్‌కుడి జాలర్లు ప్రత్యేక రంధ్రాలతో తయారు చేసిన వలలతో చిన్న సైజు చేపలను సైతం పట్టుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో 77 కిలోమీటర్లు సముద్ర తీరం సమీపంలోకి వచ్చి వందల టన్నుల కొద్ది చేపలను పట్టుకుని వెళ్లిపోతున్నారు. వారిని అడ్డుకోవాల్సిన మెరైన్ పోలీసులు, ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో చేపల వేటే జీవనాధారంగా జీవించే మత్స్యకారులు సముద్రంలో ఎంత గాలించినా ఒక్క చేపకూడా దొరక్కపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తోంది. ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని పొరుగు రాష్ట్రాల బోట్లు తమ ప్రాంతానికి రాకుండా చూడాలని మత్స్యకారులు కోరుతున్నారు.



కొండూరుపాళెం సముద్ర తీరంవద్దవున్న మత్స్యకారులు

పేదల కడుపు కొట్టేలా కేంద్ర బడ్జెట్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గూడూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలు, కార్మికులు, రైతుల కడుపు కొట్టేలా ఉందని సీపీఎం నాయకులు ఆరోపించారు. వారు బుధవారం గూడూరు టవర్ క్లాక్ ప్రాంతంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ఎరువుల సబ్సిడీ పేరుతో ఇస్తున్న రూ.17 వేల కోట్లలో ఈ ఏడాది కోత పెట్టారని తెలిపారు. పీఎం కిసాన్ యోజనా ఊసే లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.3 వేల కోట్లు కేటాయించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. విభజన హామీలను గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ధనిక వర్గాలు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. అనంతరం బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పీ శ్రీనివాసులు, ఎస్ సురేష్, ఎస్‌కే జిలానీ, వెంకటరామిరెడ్డి, అడపాల ప్రసాద్, బీవీ రమణయ్య, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కండలేరులో 54.280 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 54.280 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రి గోల్డ్ భూములపై కూటమి నేతల కన్ను

- ఇష్టారాజ్యంగా జామాయిల్ చెట్ల నరికివేత
- చోద్యం చూస్తున్న సీఐడీ అధికారులు

చిల్లకూరు : అగ్రి గోల్డ్‌కు చెందిన భూముల్లో వున్న జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న లారీలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. చిల్లకూరు మండలం ఎగువరాజుపాళెం గ్రామంలో అగ్రి గోల్డ్‌కు చెందిన భూములు సుమారు 500 ఎకరాల వరకు ఉన్నాయి. వీటిని గతంలో సీఐడీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల్లో వివిధ రకాల చెట్లున్నాయి. వాటి సంరక్షణ బాధ్యత సీఐడీది. ఈ క్రమంలో వారు ఎప్పుడో ఒకసారి వచ్చి చూసి వెళుతున్నారు. ఆ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జామాయిల్ చెట్లపై కూటమి నేత కన్ను పడింది. రాత్రి రాత్రే జామాయిల్ చెట్లను నరికి తరలించడానికి ప్రయత్నించారు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కలపను లోడ్ చేసిన రెండు లారీలు, ఖాళీగా ఉన్న మరో లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై వీఆర్వో సుబ్రమణ్యం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఇంత జరుగుతున్నా భూములను స్వాధీనం చేసుకున్న సీఐడీ పోలీసులు స్పదించక పోవడం గమనార్హం.



అగ్రి గోల్డ్ భూముల్లో అక్రమంగా నరికి తరలిస్తున్న జామాయిల్ లోడుతో ఉన్న లారీలు

అగ్గి తెగులుతో వరి పంట నష్టం


డక్కిలి: వరి పంట పొట్ట, ఎన్ను దశలో ఉన్నప్పుడు అగ్గి తెగులు సోకితే పంట దెబ్బతింటుందని, దాని నివారణకు చర్యలు చేపట్టాలని వెంటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని డక్కిలి, దేవునివెల్లంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పైరు ఎన్ను దశలో ఉన్నప్పుడు అగ్గి తెగులు మచ్చలు, ఎన్ను కింద మెడ (కీలు) మీద ఏర్పడి ఎన్నులు విరిగిపోయి ఎండిపోతాయన్నారు. దీనిని మెడ విరుపు తెగులు అని కూడా అంటారన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ప్యూజివన్ లేదా ఐసోమిన్ క్రాసిబీ మందుల్లో ఏదో ఒకటి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ఎకరాకు 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును లీటరునీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం లింగసముద్రం, వెంపటవారిపల్లిలో సాగు చేసిన వరిలో కొత్త రకాలు ఎన్ఎల్ఆర్ 3648, ఎన్ఎల్ఆర్ 3238, గంగా పంటలను పరిశీలించారు. దిగుబడి ఆధారంగా రాబోయే రోజుల్లో వాటిని రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు,. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారిణి విజయభారతి, పశువైద్యాధికారి కిషోర్‌కుమార్, వీఏఏ లిఖిత పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జున సాగర్

10 బస్సు సర్వీసులు ప్రారంభం

చిల్లకూరు : వాకాడు డిపోకు 10 నూతన బస్సులు వచ్చినట్టు ఏపీఎస్ఆర్‌టీసీ తిరుపతి రీజనల్ మేనేజర్ నరసింహులు తెలిపారు. వాటిని బుధవారం కోట బస్టాండ్‌లో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సులు వాకాడు డిపో నుంచి ప్రొద్దుటూరు, కడప, తిరుపతి ప్రాంతాలకు నడుస్తాయన్నారు. త్వరలోనే మరో మూడు బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా సర్వీసులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాడు డిపో మేనేజర్ చినపెంచలయ్య, నాయకులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆర్ఎం